తుది దశలో ఆర్‌యూబీ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదు డివిజన్ల ప్రజల సౌకర్యార్థం ప్రారంభించిన మధురానగర్ ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరాయి. ఇక్కడ తరచూ రైల్వే గేటు పడుతుండటంతో ఒకటి, 28, 29, 30, 31 డివిజన్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురానగర్‌లో రూ.17 కోట్లతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆర్‌యూబీ పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. గతంలో కోవిడ్, సాంకేతిక కారణాలతో ఆర్‌యూబీ పనులు నిలిచిపోయాయి. ఫలితంగా రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు చుట్టూ తిరిగి రావాల్సి రావటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. స్థానికుల సమస్యలను గమనించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్, మేయర్ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వీసు రోడ్డును తీర్చిదిద్దారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ఆదేశాలతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్‌యూబీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు. ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరడంతో ఐదు డివిజన్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న మధురానగర్ ఆర్‌యూబీ

శరవేగంగా పనులు



గతంలో ఆర్‌యూబీ నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రస్తుత ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో పనులు వేగవంతమయ్యాయి. అతి త్వర్లో ఈ పనులు పూర్తయ్యేలా ఉన్నాయి. మధురానగర్‌కు పునర్వైభవం వచ్చేందుకు ఆర్‌యూబీ దోహద పడుతుంది.

– పిల్లి కష్ణవేణి, మధురానగర్

అతిత్వరలోనే ప్రారంభం



ఆర్‌యూబీ పనుల్లో భాగంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా పసుపుతోట పార్కు గోడను తొలగించి వాహనాల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాం. పసుపుతోటలో రాకపోకలకు వన్ వే ఏర్పాటు చేసి కొంత మేర సమస్యను తగ్గించాం. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలోనే ఆర్‌యూబీని ప్రారంభిస్తాం.

–పెనుమత్స శిరీష, 31వ డివిజన్ కార్పొరేటర్

ప్రజల కష్టాలకు పరిష్కారం



ఐదు డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు మధురానగర్ ఆర్‌యూబీ చక్కని పరిష్కారం చూపనుంది. ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణ పనులను పూర్తిచేస్తున్నాం. ఆర్‌యూబీ అందుబాటులోకి వస్తే ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్య పరిష్కారం అవుతుంది.

– కొంగితల లక్ష్మీపతి కార్పొరేటర్, 29వ డివిజన్

హర హర.. శంభో.. శంకర


మొగల్రాజపురం కొండపై ఉన్న శివగిరి క్షేత్రం


శివ పరివారం విగ్రహాలు

- శివరాత్రికి ముస్తాబైన శివగిరి
- శివరాత్రి రోజున నాగసాధువులతో ప్రత్యేక పూజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహాశివరాత్రి పర్వదినానికి నగరంలోని శివగిరి ముస్తాబైంది. ఇక్కడ 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఎత్తున్న ఓంకార స్తూపం నగరం మొత్తం కనిపిస్తాయి. ప్రతి సోమవారం ఇక్కడకు భక్తులు అధికంగా వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రికి భక్తులు పూజలు నిర్వహించుకోడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎవరైనా వారి సొంత ఖర్చుతో శివగిరిపై శివలింగాన్ని ప్రతిష్ఠించుకోవచ్చు. శివగిరిపై త్రిమూర్తుల విగ్రహాలతో పాటుగా లక్ష్మి దేవి, దుర్గాదేవి, సరస్వతి, దత్తాత్రేయుడు, అర్ధనారీశ్వరుడు, హరిహరమూర్తి, శివపార్వతులు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, నంది విగ్రహాలను కూడా ఏర్పాటు చేశారు. గోశాలతో పాటుగా హోమగుండం కూడా ఉన్నాయి. శివరాత్రి రోజున మహాలింగార్చన, శివకల్యాణం, రుద్రహోమంతో పాటుగా అన్న ప్రసాద వితరణ కూడా జరుగుతుంది. 9వ తేది సాయంత్రం శివగిరి ఉత్సవమూర్తులను మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించనున్నామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ చెప్పారు.


నంది విగ్రహం

నాగసాధువులతో ప్రత్యేక పూజలు



మహాశివరాత్రికి శివగిరిపై ప్రత్యేక పూజలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. హిమాలయాల్లో హిందూ సంప్రదాయాల ప్రకారం శివుడికి జరిగే అభిషేకాలు అన్ని మహాశివరాత్రి రోజున శివగిరిపై నిర్వహిస్తాం. ఆ రోజు జరిగే ప్రత్యేక పూజల్లో నాగసాధువులు పాల్గొంటారు. శివరాత్రి రోజున శివగిరికి వచ్చే భక్తులందరికి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశాం. శివగిరిపైకి మెట్లు ఎక్కలేని భక్తుల కోసం శివగిరి కింద మోడరన్ ఫుడ్స్ ఎదురుగా కొండ దిగువ భాగంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాం. శివగిరిపై పూజల వివరాలకు 98481 14960 నంబరులో సంప్రదించాలి.

–మల్లికార్జునశర్మ, శివగిరి వ్యవస్థాపకుడు

త్వరలో ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల పంపిణీ

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ అర్బన్ పరిధిలో అర్హులకు ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పత్రాలు అందించే కార్యక్రమం త్వరలో జరగనుందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ కారణాల వల్ల తమ ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న అర్బన్ పరిధిలో అర్హులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా హక్కు పత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించేందుకు కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వివిధ శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. గతంలో వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా అందజేసిన నివాస స్థలాల్లో కొన్ని 22(ఏ) కింద ఉండటం, పట్టాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ లేకపోవడం వంటి కారణాల వల్ల ఆయా స్థలాల లబ్ధిదారులు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. వీరి ఇబ్బందులను తొలగించి పూర్తి హక్కులు కల్పిస్తూ దాదాపు 30 వేల మందికి ఫ్రీ హోల్డ్ రైట్స్ పత్రాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కృష్ణా నది రిటైనింగ్ వాల్, పార్కు తదితర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, కేసీ డివిజన్ ఈఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు

అలరించిన నృత్య ప్రదర్శన



విజయవాడ కల్చరల్: మహాశివరాత్రి సందర్భంగా జేఎంఎస్ నాట్యవేద ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం జంగం సిస్టర్స్ నృత్య దర్శకత్వంలో చిన్నారులు ప్రదర్శించిన అంశాలు కూచిపూడి నాట్య వైభవాన్ని చాటాయి. శివ లీలలు, శివతాండవం, శివస్తుతి, శివశరణం, కృష్ణ శబ్దం, రావణాష్టకం అంశాలను ప్రదర్శించారు. పూజిత, రిచిత, గేయ, సంహిత, మౌనికచ తన్మయి, జాన్వి, దీక్ష, శ్లోక, శ్రీమయ, విణ్మయి తోపాటు 100 మంది చిన్నారులు నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూచిపూడి నృత్య సంప్రదాయాలు విశిష్టమైనవని వాటిని భావితరాలకు అందించాలని తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హనుమంతరాయ గ్రంథాలయం ప్రధాన కార్యదర్శి నీలం దుర్గారావు, జేఎంఎస్ యోగ భారతి సంస్థ నిర్వాహకులు జగం శ్రీనివాస చక్రవర్తి, విజయకుమార్ సంస్థ లక్ష్యాలను వివరించారు.

● ఉరకలెత్తిన ఉత్సాహం




మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, దేవినేని నెహ్రూ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు; సీడీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడతూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. ఎన్నికలకు మేము సిద్ధం అంటూ నినాదాలు హోరెత్తించారు. గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కళ్యాణ మండపంలో బుధవారం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సభలో బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లుతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. పండుగ వాతావరణంలో నిర్వహించిన సభలో నాయకులు ఎన్నికలకు సిద్ధమా అంటే మేము సిద్ధం అంటూ పిడికిలి బిగించి చేతులెత్తి నినదించడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. అంతేకాదు అవినాష్ సమర్థత గురించి అతిథులు చెబుతుంటే కార్యకర్తలు ఉత్సాహంతో నినాదాలు చేశారు.

–లబ్బీపేట(విజయవాడతూర్పు)


మేము సిద్ధం అంటున్న నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆశీస్సులతో శివరామకృష్ణ క్షేత్రంలోని శివాలయంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం సంకల్పదీక్ష, వాస్తు హోమం, రుద్ర, పాశుపత హోమం, నవగ్రహారాధన తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. భారతీ తీర్థ స్వామి 74వ జన్మదినం సందర్భంగా ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్ర నవావరణ తదితర కార్యక్రమాలను జరిపించారు.

8న అఖండ నాదార్చన

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం అఖండ నాదార్చన కార్యక్రమం జరుగుతుందని సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ బుధవారం ఒక ప్రకనలో తెలిపారు. గవర్నర్‌పేటలోని చోడవరం వారి వీధిలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. నగరానికి చెందిన సంగీత కళాకారులు నాదార్చనలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రముఖ విద్వాంసుడు సాయి చరణ్‌రాజ్ గాత్రం, చివరిగా హిందూస్తానీ సంగీత విద్వాంసురాలు ముష్టి శారద విచిత్ర వీణవాదన జరుగుతాయని వివరించారు.

వడ్డీ మినహాయింపుతో 31లోగా పన్నులు చెల్లించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ నెలాఖరులోపు బకాయి మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 2023 – 2024 ఆర్థిక సంవత్సరం వరకు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై విధించిన వడ్డీని మాఫీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే 2023 – 2024 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వడ్డీతో చెల్లించి ఉన్నట్లయితే ఆ వడ్డీని 2024 – 2025 సంవత్సరం ఆస్తి పన్నుకు జమ చేస్తారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు నగరంలోని మూడు సర్కిల్స్ పరిధిలోగల అన్ని క్యాష్ కౌంటర్లలో సకాలంలో చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలను కోరారు. క్యాష్ కౌంటర్లు పని దినాల్లోనే కాకుండా సెలవు దినాల్లోనూ ఉదయం పది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ తరుపున నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన సూర్యప్రభ సంగీత అకాడమీకి చెందిన లలిత, శ్రీనిత్య, సురేఖ, జగన్మోహిని, అభిరామ్‌లు ఆలపించిన భక్తి రంజని భక్తులకు అకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు అమ్మవారి కీర్తనలు ఆలపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులు కళావేదికపై జరుగుతున్న భక్తిరంజనిని ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలు అందచేశారు.

నటుడు అక్కినేని విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశం గర్వించతగ్గ మహానటుడు, దాదా పాల్కే అవార్డ్ గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో అక్కినేని శిలా విగ్రహం ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన, పూజా కార్యక్రమాలు జరిగింది. డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళా నిలయమైన ఈ కళాక్షేత్ర ప్రాంగణంలో అక్కినేని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా స్థలం కేటాయించేందుకు కృషి చేసిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)కు ధన్యవాదాలు తెలిపారు. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడలో మహానటుడు డాక్టర్ అక్కినేని విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేయటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, మాదు కృష్ణారావు, డీ లక్ష్మీకుమారి, రాజు, రాజారావు, నాగమల్లిక, షఫీ, ఎం.రాము, పి.రమేష్, విల్సన్ రాజు, పి.సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


లబ్ధిదారుకు పట్టా అందజేస్తున్న ఉమ్మడి రమాదేవి


లబ్ధిదారులతో కార్పొరేటర్ పెనుమత్స శిరీష

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి అన్నారు. 256వ సచివాలయ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇల్లు లేని పేద కుటుంబం ఉండకూడదనే ఉద్దేశంతో 30 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను ఇచ్చిన ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముందుకే సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత పాలకులు టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ నీరజ, వెల్ఫేర్ సెక్రటరీలు రమేష్, ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు విజయశేఖర్‌రెడ్డి, వసుధ, వీఆర్వో నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఇళ్ల పట్టాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్ అన్నారు. ప్రకాష్ నగర్ 268 సచివాలయంలో బుధవారం 200 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పొందిన లబ్ధిదారులకు పదేళ్ల తరువాత సర్వహక్కులు లభిస్తాయన్నారు.

పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో 205, 206 వార్డు సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీ ఇంటి పట్టాలు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్పొరేటర్ పెనుమత్స శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలకు ఇంటి స్థలం ఇవ్వటంతో పాటు సర్వ హక్కులతో పట్టాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను ప్రభుత్వం మోసం చేసిందని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, వెంకటరెడ్డి, విజయ్ వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. దుర్గాపురం 199వ వార్డు సచివాలయంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి చేతుల మీదుగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, పసుపులేటి రమేష్ పాల్గొన్నారు.

50 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్న పేదల సొంతింటి కల నెరవేరిందని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. డివిజన్‌లోని 88, 91, 92 సచివాలయాల పరిధిలో 50 మంది లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కూడా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వడంపై పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు కుక్కల అనిత పేర్కొన్నారు.


లబ్ధిదారులతో కార్పొరేటర్ మల్లీశ్వరి


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ అనిత

మహిళల అభ్యున్నతికి ‘వైఎస్సార్ చేయూత’

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు




అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం రాష్ట్రంలోని మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు, వారి అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతోందని పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత ద్వారా నియోజకవర్గంలో 10,638 మందికి సుమారు రూ.20 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి కుటుంబానికి మహిళలే రథసారథులుగా వ్యవహరిస్తూ, ఆర్థికంగా బలోపేతం అవ్వాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ఈ పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోందని తెలిపారు. ఏటా రూ.18,750 చొప్పున నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి చేయూత పథకం ద్వారా 2020–21 ఆర్థిక సంవత్సరంలో 6,034 మందికి రూ.11.31 కోట్లు, 2021–22లో 6,232 మందికి రూ.11.68 కోట్లు, 2022–23లో 10,875 మందికి రూ.20.39 కోట్ల చొప్పున లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు మరింత ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

బ్రాహ్మణులకు ఉన్నత స్థానం కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్

బ్రాహ్మణ సంఘం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణులకు రాజకీయాల్లో ఉన్నత స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వెంటే తాము నడుస్తామని బ్రాహ్మణ కార్పొరేషన్ వెల్ఫేర్ చైర్మన్ పి.కె.రావు, బ్రాహ్మణ సంఘం నాయకులు స్పష్టంచేశారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లికి మద్దతుగా రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకులు, పెద్దలు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. పి.కె.రావు మాట్లాడుతూ.. బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్రంలోని బ్రాహ్మణ సంఘాలన్నీ ముందుకొచ్చాయన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెల్లంపల్లి శ్రీనివాసరావును ప్రకటించడం సంతోషదాయకమని, ఆయన విజయానికి తామంతా కృషి చేస్తామని ప్రకటించారు. దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏకంగా నాలుగు అసెంబ్లీ స్థానాలను కేటాయించారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణులమంతా ఐక్యంగా ముందుకెళ్తామని, సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు పురుషోత్తం శర్మ మాట్లాడుతూ.. నవరత్నాలు పొందిన బ్రాహ్మణ మహిళలు సీఎం జగనన్నకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని, వైఎస్సార్ సీపీ గెలుపునకు సమష్టిగా కృషిచేయాలని ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రాహ్మణ సంఘాలు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఆచంట లలిత ఆదిత్య, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు మంగళంపల్లి అంజిబాబు, లక్ష్మీ రాయల్, అనుపమ నాగరాజు, మహిళా నాయకులు శారదలక్ష్మి, సంఘ నాయకులు జి.వి.ఎల్.ఎస్.ఆచార్యులు, ఐ.వి.అప్పారావు, వేదాంతం చైతన్య, కోటంరాజు వేంకటేష్ శర్మ, సీహెచ్ రామకృష్ణ, శేషగిరిరావు, జి.సీతారాం, రామ భద్రుడు, ద్రాక్షయని, ఆదవ కేశవరావు తదితర బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీకే రావు బ్రాహ్మణ సంఘం నాయకులు

■ ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యురాలిగా అమలాపురపు రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన అల్లం భువన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయానికి చేరుకున్న అమలాపురపు రామలక్ష్మి, అల్లం భువన్‌కుమార్ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం ఈఓ కె.ఎస్.రామారావును మర్యాద పూర్వకంగా కలిశారు.